



# ఇంటి బాట

## నేటి నుంచి దసరా సెలవులు

బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు గురువారం ఇంటిబాట పట్టారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ప్రయాణ ప్రాంగణాలు తల్లిదండ్రులు, విద్యార్థులతో సందడిగా మారాయి.






## సెలవుల వేళ..

# జర పైలం



- నేటి నుంచి దసరా సెలవులు
- నిండిన చెరువులు, కుంటలు, వాగులు, చెక్‌డ్యాంలు, ప్రాజెక్టులు
- పిల్లలు సరదాగా ఈతకు వెళ్లే అవకాశం
- జాగ్రత్తగా ఉంటే ప్రమాదాలు దూరం
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం

నిజామాబాద్, అక్టోబర్ 12 :

**జిల్లాలో** విస్తారంగా వర్షాలు కురవడంతో వాగులు, వంకలు, చెరువులు, చెక్‌డ్యాంలు, కుంటలు నిండి జలకళతో ఉట్టిపడుతున్నాయి. మంజీర, గోదావరి నదులు పారుతున్నాయి. ప్రాజెక్టుల్లోకి భారీగానే నీరు వచ్చి చేరింది. విద్యాసంస్థలకు శుక్రవారం (నేటి) నుంచి సెలవులు ప్రకటించారు. సెలవులు రావడంతో ఎక్కడెక్కడో చదువుకుంటున్న విద్యార్థులంతా ఇంటికి వచ్చేస్తారు. గ్రామంలో సంతోషంగా గడిపేందుకు ఉత్సాహం చూపుతుంటారు. స్నేహితులతో కలిసి సినిమాలు, షికార్లకు వెళ్తుంటారు. సరదా కోసం చెరువులు, వాగులు, కుంటలు, ప్రాజెక్టుల వద్దకు వెళ్లి ఈతలు కొడుతుంటారు. ఈత నేర్చుకుంటుంటారు. ఈత వచ్చిన వారు, రాని వారు నీటిలో దిగి జలకాలాటాల్లో మునిగి తేలుతుంటారు. ఈ సమయంలో అనుకోని ప్రమాదం జరిగితే ఎంతో సంతోషంగా గడపాల్సిన పండుగ సమయంలో విషాదం నిండిపోతుంది. ఇలాంటి పరిస్థితులు ఎదురు కాకుండా ఉండాలంటే పిల్లలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉండాలి. వారు ఏంచేస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారు గమనిస్తూ ఉండాలి. నీటి వనరుల వద్దకు పిల్లలు వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు చెప్పాలి.

### పొంచి ఉన్న ప్రమాదం


జిల్లాలో పలు చోట్ల చెరువుల్లో మునిగి మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి మృత్యువాత పడుతున్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. ఈత రాని వారు ఈత వచ్చిన వారిని వెంట తీసుకెళ్లడం ఉత్తమం. స్నేహితులతో కలిసి ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లి ప్రమాదాన్ని కొని తెచ్చుకోకపోవడం ఉత్తమం.

### చెరువుల వద్ద జాగ్రత్త...

ఎప్పుడో చూసిన చెరువులు వాటి రూపురేఖలే మారిపోయాయి. ఎక్కడ గుంత ఉంటుందో, ఎక్కడ ఊబి ఉంటుందో తెలియని పరిస్థితి. కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో చెరువుల్లోకి దిగక పోవడమే చాలామంచిది. ఇక చెరువులో స్నానాలు చేయాలన్న ఆలోచననే మానుకోవడం మంచిది.

- చెరువులు, వాగులు, ప్రాజెక్ట్‌ల వద్ద సెల్ఫీల మోజులో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సెల్ఫీల విషయంలో నీటికి దూరంగా ఉండేలా చూసుకోవడం మంచిది.
- చెక్‌డ్యాంల వద్ద నీటి ప్రవాహం ఎలా ఉంటుందో చెప్పలేం. వర్షాలు పడితే వరద వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి చెక్‌డ్యాంల వద్ద నీటి లోపలకు వెళ్లకుండా ఉండడమే మంచిది.
- ఈతరాని వారు ఏ ప్రాంతంలో కూడా నీటిలోకి వెళ్లకుండా ఉండడమే మంచిది.
- నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో ఈత వచ్చిన వారు కూడా నీటిలోకి వెళ్లక పోవడమే ఉత్తమం.
- దసరా సెలవుల్లో కుటుంబ సమేతంగా ప్రాజెక్టుల సందర్శనకు వెళ్తుంటారు. ఇలాంటి సమయంలో తమ పిల్లలను నీటిలోకి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- బతుకమ్మల నిమజ్జనం సమయంలో పిల్లలు చెరువుల వద్దకు వెళ్తుంటారు, రాత్రి సమయం కావడంతో పిల్లలను నీటి వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- చెరువుల్లో పూడిక తీయడం, మట్టి తొలగింపు వంటి పనులు చేపట్టడంతో గుంతలతో ప్రమాదం పొంచి ఉన్న విషయాలను పిల్లలకు తెలియజేయాలి.
- ఇంటికి వచ్చిన పిల్లలకు చెరువుల వద్దకు వెళ్లకుండా ముందుగానే చెప్పాలి.
- నిండిన చెరువులు, ప్రాజెక్ట్‌లు, వాగులను చూడాలన్న కోరిక అందరికీ ఉంటుంది, కానీ, అక్కడకు వెళ్లిన తర్వాత చేసే చిన్నచిన్న పొరపాట్లతో జీవితాలను కోల్పోతున్న సంఘటనలు నిత్యం చూస్తూనే ఉన్నాం. కాబట్టి చిన్నపాటి జాగ్రత్తలు పాటించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎలాంటి ప్రమాదాలకు చోటివ్వకుండా సెలవులను సరదాగా గడపాలి.

- పాల ఉత్పత్తిలో జిల్లాలోనే మొదటి స్థానం
- రోజూ 240 లీటర్ల సేకరణ
- ముర్రా, జెర్సీ, హెచ్‌ఎఫ్ జాతి పాడిగేదెల పెంపకం
- ప్రముఖుల ప్రశంసలు, అవార్డులు
- అడ్లూర్‌ఎల్లారెడ్డి పాడి రైతు జ్యోతీచిన్నయ్యలపై ప్రత్యేక కథనం


మిషన్ ద్వారా ఆవుపాలను సేకరిస్తున్న పైడి జ్యోతి



పశు పోషణలో రాణిస్తున్న దంపతులు

## పైడి ఇంట..

# పాడి సిరులు

ఆర్థికంగా ఎదగాలంటే బాగా చదివి ఉద్యోగాలే చేయాల్సిన అవసరం లేదని, కొద్దిగా కష్టపడేతత్వం, మరికొంత పెట్టుబడి ఉంటే సరిపోతుందని నిరూపించారు ఈ దంపతులు. పాడి పరిశ్రమలో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉత్తమ పాడి రైతులుగా అవార్డులను సొంతం చేసుకొని సన్మానాలు, సత్కారాలు, మన్ననలు పొందుతున్న దంపతులపై నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనం..

- సదాశివనగర్, అక్టోబర్ 12

**కామారెడ్డి జిల్లా** సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన దంపతులు పైడి జ్యోతీచిన్నయ్య ఇంటర్ వరకు చదువుకున్నారు. ఉద్యోగం దొరకదని బాధపడకుండా ఏదైనా మంచి పనిచేయాలనే ఆలోచనతో వారు మొదట పౌల్ట్రీ ఫాంను ఇంట్లోనే ఏర్పాటు చేసి నాలుగేండ్లు కోడి పిల్లలను పెంచడం మొదలుపెట్టారు. కానీ కోడిపిల్లలకు రోగాలు ఎక్కువ రావడం, అవి మృత్యువాత పడడంతో నష్టాలపాలయ్యారు. పెట్టిన పెట్టుబడి రాక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీంతో భర్త చిన్నయ్య, అత్త,మామలతో ఆలోచించి పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపారు. గతంలో అత్త, మామ పైడి జానకీ, జనార్దన్ నాలుగు పశువుల పెంపకంతో కొంతమేర డబ్బులు సంపాదించేవారు. వారిని స్ఫూర్తిగా తీసుకున్న భార్యాభర్తలు జ్యోతీచిన్నయ్య.. ఇద్దరూ కలిసి పశు సంపద ద్వారా ఆర్థిక వృద్ధి సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అదే సంకల్పంతో ఇంటి ముందు రేకులతో షెడ్డు వేసి మేలుజాతి ఆవులు, బర్రెలను కొనుగోలు చేశారు.






### రోజుకు 240 లీటర్లు..

ఇందులో హెచ్‌ఎఫ్, జెర్సీ, ముర్రా తదితర జాతులకు చెందిన, ఆవులు, బర్రెలు ఉన్నాయి. మొత్తం పశువులు 26 వరకు ఉండగా, అందులో 16ఆవులు, 10 బర్రెలు ప్రస్తుతం పాలిస్తున్నాయి. ప్రతి రోజూ 240లీటర్ల ఆవుపాలను అడ్లూర్ ఎల్లారెడ్డి విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి అందజేస్తున్నారు. బర్రెపాలను ఇంటి అవసరాలకు, ఇతరులకు విక్రయిస్తారు. పాల విక్రయంతో రోజుకు రూ.8వేల వరకు ఆదాయం వస్తున్నది. ఖర్చు, దాణా, గడ్డీ ఇతరత్రా వాటికి రూ.4,500 పోగా రూ.3500 ఆదాయం సంపాదిస్తున్నారు.

### సొంత పొలంలో గడ్డి పెంపకం..

జ్యోతీచిన్నయ్యలకు ఉన్న 6ఎకరాల వ్యవసాయ భూమిలో నాలుగు ఎకరాల్లో గడ్డి జాతులైన సూపర్ నేపీయార్, రెడ్ నేపీయార్, స్మాట్ నేపీయార్, ప్యారా గడ్డి, హెడ్జ్ న్యూసరన్ తదితర హైబ్రిడ్ జాతి గడ్డిని పెంచుతున్నారు. ప్రతిరోజూ మిషన్ ద్వారా కటింగ్ చేసిన గడ్డిని, దాణాను పశువులకు పాకలో ఏర్పాటు చేసిన కుండీల్లో వేస్తారు. ఆవు, బర్రె పాలను ఉదయం, సాయంత్రం పూట మిషన్ల సహాయంతో సేకరిస్తారు. పశువుల కొట్టంలో ఉదయం 4 గంటలకే భక్తి గీతాలను వినిపిస్తూ పాలను సేకరించడం విశేషం. ఉదయం, సాయంత్రం పశువులను నీటితో శుభ్రంగా కడిగి ఉంచుతారు. పశువులను బయట తిప్పకుండా పాకలో మాత్రమే ఉంచుతారు. దీంతో పాలు ఎక్కువ ఇస్తాయని చెబుతున్నారు.


ఆవుదూడలతో పైడి చిన్నయ్య

### రుణాలు.. సబ్సిడీ

పశువుల కొనుగోలు కోసం ఐసీఐసీఐ బ్యాంకు ద్వారా రుణం తీసుకున్నారు. రూ.50వేల వరకు నాబార్డు నుంచి సబ్సిడీ కూడా వచ్చింది. పశుక్రాంతి పథకం ద్వారా రెండు ఆవులను సబ్సిడీపై తీసుకున్నారు. గత నెలలో విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అడ్లూర్ ఎల్లారెడ్డి ద్వారా స్త్రీనిధి కింద రెండు బర్రెలను కూడా కొనుగోలు చేశారు. పశువులకు ఎలాంటి వ్యాధులు వచ్చినా పశువైద్యులు సూచించే మందులను వాడుతూ వాటిని కంటికి రెప్పలా కాపాడుతున్నారు. పాలు సేకరించేందుకు రూ.80వేలతో ప్రత్యేక మిషన్‌ను కొనుగోలు చేశారు. రూ.18వేలతో గ్రాస్‌కట్టర్, రూ.90వేలతో గడ్డి మిషన్‌ను కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్కో ఆవు ధర రూ.లక్ష వరకు పలుకుతున్నది. ప్రతి ఆవు పూటకు 8-10 లీటర్లు, రెండు పూటలు కలిపితే 18-30 లీటర్ల వరకు పాలిస్తున్నాయి.

### మహిళలు ముందుకు రావాలి..



నేటితరం మహిళలు పశు పోషణలో ముందుకు రావాలి. మహిళలకు తెలంగాణ ప్రభుత్వం విజయ డెయిరీ ఆధ్వర్యంలో చేయూతనందిస్తూ ప్రోత్సహిస్తున్నది. విజయ డెయిరీలో ప్రతిరోజూ పాలను పోస్తూ జిల్లాలోనే ఉత్తమ మహిళా పాడి రైతుగా పైడి జ్యోతీచిన్నయ్య చాలాసార్లు అవార్డు సాధించారు. ప్రతిమహిళా పైడి జ్యోతిని ఆదర్శంగా తీసుకోవాలి.

**- యాడారం రమేశ్, బీఎంసీ మేనేజర్, అడ్లూర్‌ఎల్లారెడ్డి**

### పశుపోషణలో జిల్లాలోనే ఆదర్శం..



పైడి జ్యోతీచిన్నయ్య పశు వైద్యుల సలహా, సూచనల మేరకు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ పశుపోషణ చేపడుతున్నారు. పాడి అభివృద్ధిలో మహిళా రైతు అయిన జ్యోతీచిన్నయ్య జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు.

**- జుగల్ కిశోర్, పశుగణన సహాయకుడు, అడ్లూర్ ఎల్లారెడ్డి**

### అవార్డు రావడం సంతోషకరం..



నేను ఇంటర్ చదివాను. ఈ చదువుతో ఎలాంటి ఉద్యోగం రాదని బాధపడకుండా భర్త చిన్నయ్య, అత్త,మామ సహాయంతో పాడిపరిశ్రమపై మక్కువ పెంచుకున్నాను. హెచ్‌ఎఫ్, జెర్సీ, ముర్ర తదితర మేలు జాతి పాడి పశువులను కొనుగోలు చేసి వాటి ద్వారా సంతాన ఉత్పత్తిని పెంచాము. ప్రతి రోజూ విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి 240లీటర్ల పాలను పోస్తాను. 2015లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డు అందజేశారు. ఇటీవల తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో కామారెడ్డి విజయ డెయిరీలో ఉత్తమ పాడి రైతు అవార్డు అందజేశారు. విజయ డెయిరీ అధికారుల కృషి, పశువైద్యుల సహకారంతో పాడి పరిశ్రమలో రాణిస్తున్నాను. పాడిపరిశ్రమలో రాణిస్తున్న మహిళలకు తెలంగాణ ప్రభుత్వంలోనే అవార్డులు వచ్చాయి. మహిళల స్వశక్తిని గుర్తించి అవార్డులు ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

**- పైడి జ్యోతి, పాడి రైతు, అడ్లూర్ ఎల్లారెడ్డి**

### సాధించిన అవార్డులు

- 2015లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ యోగితా రాణా చేతుల మీదుగా అవార్డు
- 2023 తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో జిల్లా ఉత్తమ పాడిరైతు..
- విజయ డెయిరీలో పాల సేకరణలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు.
- ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా తెలంగాణ పాడి పరిశ్రమ సహకార, విజయ డెయిరీ నిజామాబాద్ ఆధ్వర్యంలో సన్మానం
- పాల ఉత్పత్తిలో డివిజన్‌లోనే మొదటి స్థానంలో నిలిచింది.


2015లో అప్పటి కలెక్టర్ యోగితారాణా చేతుల మీదుగా సన్మానం పొందుతున్న పైడి జ్యోతి

